క్లుప్తంగా

13న చలో విజయవాడ

భామిని: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక ధర్మరాజు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో టీడీపీ నాయకుడు వర్ల రామయ్య తమ నిరసన కార్యక్రమాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వీఓఏల ఉపాధి దెబ్బతీసే మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు, ఉద్యోగ భద్రత, అక్రమ తొలగింపులు, బకాయి జీతాలు చెల్లించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలల సందర్శన

సీతంపేట: పాలకొండ జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ సోమవారం పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సామరెల్లి బాలికల ఆశ్రమపాఠశాల, దోనుబాయి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వండి పెడుతున్న మెనూ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది మూర శామ్యూల్ పాల్గొన్నారు.

వీఏఏలకు పదోన్నతి



పదోన్నతి ఆర్డరు కాపీలు అందజేస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని ఉద్దవోలు, సంతోషపురం గ్రామ సచివాలయాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న బి.రాఘవేంద్రరావు, ఎం.హరీష్‌లకు ఏఈవో(అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షనల్ ఆఫీసర్)లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంపీడీవో జి.పైడితల్లి చేతులమీదుగా వారికి సోమవారం ఆర్డర్లు అందజేశారు. రాఘవేంద్రరావు పెదగుడబ సచివాలయంలో, హరీష్ మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో హరీష్ ఏఈవోలుగా పనిచేయనున్నారు. సదరు ఉద్యోగులకు ఏవో ఆర్.విజయభారతి అభినందనలు తెలిపారు.

గ్యాస్ లీక్: స్వల్ప ఆస్తి నష్టం



గ్యాస్ లీక్ అవ్వడంతో ఎగసిపడుతున్న మంటలు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ఉన్న ప్రతాపరుద్ర కాలనీలో గొట్టిపల్లి ముత్యాలమ్మ ఇంట్లో గ్యాస్ లీక్ అయి స్వల్ప ఆస్తినష్టం సంభవించినట్లు ఎస్ఐ అనీష్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి యజమానురాలైన ముత్యాలమ్మ వంట చేసేందుకు ఇంట్లోని గ్యాస్ వెలిగించగా, ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో భయంతో ఆమె బయటకు పరుగులు తీసింది. స్థానికులు అప్రమత్తమై జరిగిన ఘటనపై ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. కొంతమేర ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం.



న్యాయం కోసం నిరీక్షణ

- సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగుల నిరసన
- 16 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 104 సేవలను ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామాల్లో సంచార వైద్య సేవలు అందిస్తూ రోగుల పాలిట సంజీవనిగా గుర్తింపు పొందింది. గర్భిణులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతో మందికి 104లో పనిచేసే సిబ్బంది ఆపద్బంధవులుగా నిలిచారు. 104లో ఏళ్లుగా సేవలందిస్తున్న డ్రైవర్లు, డీఈఓలకు మాత్రం ఇంతవరకు సరైన న్యాయం జరగలేదు. న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. 104 ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు గత నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకూడదన్న ఆలోచనలో వైద్య సేవలందిస్తూనే.. వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు

- 104 సేవలను గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలి.
- డీఎస్సీ ఆర్‌ఓఆర్ ప్రకారం నియామకాలు పొంది 16 ఏళ్లుగా (2008 నుంచి) సేవలందిస్తున్న 326 మందిని వైద్యారోగ్య, ఇతర శాఖల్లో డ్రైవర్లుగా నియమించాలి.
- గతంలో జరిగిన చర్చల్లో ప్రభుత్వం అంగీకరించిన విధంగా 64 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబుల ప్రకారం వేతనాలు అమలు చేయాలి.
- 2020 నుంచి పనిచేస్తున్న డ్రైవర్లు, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- జీఓ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- ఇతర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మాదిరిగా 104లో పనిచేస్తున్న ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 సంవత్సరాలకు పెంచాలి. 62 సంవత్సరాల వరకు పెంచే అవకాశం పరిశీలించాలి.
- వేతనాలు నెల నెలా చెల్లించేలా చర్యలు చేపట్టాలి.
- చట్ట ప్రకారం యజమాని చెల్లించాల్సిన పీఎఫ్ వాటా యజమానితో కట్టించాలి.
- చట్ట ప్రకారం సెలవులు మంజూరు చేయాలి. అలాగే ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలి.
- ప్రస్తుతం పనిచేస్తున్న వారికి బదిలీలకు అవకాశం కల్పించాలి. ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి.
- డీఈఓ, డ్రైవర్లకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇచ్చి ప్రాధాన్యత కల్పించాలి.
- వాహన రిపేర్లు, మెయింటినెన్స్ చేయించాలి.

పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలి



104 సేవలను గతంలో మాదిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలి. ఈ వాహనాల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. అంతవరకు జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. పీఎఫ్ వాటా యాజమాన్యమే చెల్లించాలి.

– ధర్రు ఆనందరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

ఉద్యోగ భద్రత కల్పించాలి



గత 16 ఏళ్లుగా 104లో చాలీచాలని జీతాలతో సేవలందిస్తున్నాం. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేశాం. ఇప్పుడు చాలా మందికి వయసు కూడా పైబడింది. ఏ ఉద్యోగానికి అర్హులు కాకుండా పోయాం. కాబట్టి ప్రభుత్వం మా సేవలను గుర్తించి పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని హక్కులు కల్పించాలి. – బి.వి.దుర్గాప్రసాద్, 104 ఉద్యోగుల సంఘం నాయకుడు

అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలి



ఎస్ఐలకు సూచనలిస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంకల్పం పేరిట గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి సూచించారు. మండల పరిధిలోని ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు పి.నారాయణరావు, నీలకంఠారావులతో సోమవారం సమావేశమైన ఆయన.. సంకల్పం పేరుతో గ్రామాల్లోని ప్రజలకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై ఆరాతీశారు. ప్రజల్లో మంచి మార్పును ఆశించి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే డ్రాప్ బాక్సుల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించవచ్చన్నారు. ముఖ్యంగా గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, ఖైనీ, సారా వంటి మత్తు పదార్థాలతో పాటు మద్యం అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా...!



తుప్పల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

వీరఘట్టం: మూడేళ్ల కిందట చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించారు. అయితే ఈ పనులు పూర్తయి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు విగ్రహాన్ని మెయిన్ రోడ్డులో ప్రతిష్ఠించకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాన్ని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న తుప్పల్లో నిర్లక్ష్యంగా వదిలేశారని కేవీపీఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు విగ్రహాన్ని వీరు సోమవారం పరిశీలించారు. వెంటనే విగ్రహాన్ని జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎన్.సింహాచలం, కె.సింహాచలం, ప్రసాదరావు, తదితరులు కోరారు.

గిరిజనులకు ఆధునిక వైద్యం

- ఎమ్మెల్యే జయకృష్ణ



బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: గిరిజనులకు అత్యాధునిక వైద్య సేవలందించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, చర్మవ్యాధి నిపుణుడితో పాటు మరికొందరు డాక్టర్లు, స్టాఫ్‌నర్స్‌ల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయితే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రాంతీయ ఆస్పత్రి అదనపు భవనాలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాలు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజినీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ బి.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ సర్జన్ డీవీ శ్రీనివాస్, ఈఎన్‌టీ శివకుమార్, చిన్నపిల్లల వైద్యుడు మనోజ్‌కుమార్, ఆస్పత్రి కమిటీ మెంబర్లు సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

భామిని: మండలంలోని 30 చెరువుల్లో 37,900 చేప పిల్లలను ప్రజా ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా మత్స్యకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేప పిల్లలను అందిస్తున్నట్లు చెప్పారు. పాలవలస, మనుమకొండ, బుచ్చిమానుగూడ పంచాయతీల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మల నిబ్బరం, సర్పంచులు కేశవ్, తమ్మారావు, భార్గవ్‌నాయుడు, వెలుగు ఏపీఎం చక్రపాణి, ఉపాధి ఏపీఓ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

37,400 చేప పిల్లల పంపిణీ ..

సీతంపేట: మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల్లో పెంచేందుకు 37,400 చేపపిల్లలను సోమవారం పంపిణీ చేసినట్టు ఎఫ్‌డీఓ డి.గోపీకృష్ణ తెలిపారు. పులిపుట్టి, చిన్నబగ్గ, చిన్నగోరపాడు, ఈతమానుగూడ, రేగులగూడ, తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఫింగర్లింగ్ చేపలు విడిచిపెట్టారు. వందశాతం సబ్సిడీపై పంపిణీ చేశామన్నారు. 90 శాతంపై 2 వీలర్స్, ఐస్‌బాక్సులు, వలలు వంటివి కూడా సరఫరా చేస్తామని ఎఫ్‌డీఓ తెలిపారు. పీహెచ్‌ఓ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నూతన ఎంపీడీఓకు ఆహ్వానం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, సహ అధికారులు

భామిని: నూతన ఎంపీడీఓగా కె.సత్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, సహచర అధికారుల సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అప్రమత్తం..



భూ సమస్యలపై రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సమస్యనూ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తనను సంప్రదించాలని సూచించారు. సమస్య పెద్దదైతే జిల్లా అధికారులను సంప్రదించి పరిష్కరిద్దామని చెప్పారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మున్నాయుడు, వీఆర్‌ఓలు జి.రాజేంద్రప్రసాద్, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. – వీరఘట్టం

పరామర్శ..



విశాఖ ఉక్కునగరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలకొండ ఇందిరానగర్ కాలనీకి చెందిన రమణకుమార్, రూపేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. అలాగే ఇటీవల మరణించిన రెడ్డి సన్యాసిరావు కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు పాలవలస ధవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, తదితరులున్నారు. – పాలకొండ

కార్తీక వనభోజనం



పోలిపాడ్యమి పురస్కరించుకుని, గరుగుబిల్లి మండలంలోని కొత్తూరులో గ్రామస్తులు సోమవారం వనభోజనాలు చేశారు. ఏటా కార్తీకమాసం చివరి రోజు పోలిపాడ్యమి పూజలు చేసినానంతరం ఇలా అందరూ కలిసి భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. తామంతా ఐక్యంగా ఉన్నామనే దానికి ఈ కార్యక్రమం నిలువెత్తు నిదర్శనమని గ్రామస్తులు చెబుతుండడం విశేషం. గొట్టివలస, శివ్వాం, కొత్తూరు, రావుపల్లి, పెదగుడబ గ్రామాల్లో సైతం ఈ తరహా కార్యక్రమం జరిగింది. –గరుగుబిల్లి

ఫెంగల్ ధాటికి వరి పంటకు నష్టం



మల్లి ప్రాంతంలో నేలకొరిగిన వరి పంట

సీతంపేట: ఫెంగల్ తుఫాన్ ధాటికి వరి పంటకు నష్టం ఏర్పడింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నేలకొరిగిందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మండలంలోని మల్లి, శంబాం, హడ్డుబంగి, కుశిమి, గొయిది, దోనుబాయి, కడగండి, పరిసర ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. దీంతో ఈ సంవత్సరం నష్టాలు తప్పవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

- ఎస్సై ప్రయోగమూర్తి



సన్మార్గంలో నడవాలంటూ విద్యార్థులకు సూచిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: విద్యార్థులు చెడు స్నేహాలు, అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రయోగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు అపరిచితులతో ఎలా నడుచుకోవాలి.. అనుకోని పరిస్థితులు ఎదురైతే ఎలా వ్యవహరించాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘువర్మకు మద్దతు ఇవ్వాలి



ధర్మలక్ష్మీపురంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మరోసారి మద్దతుగా నిలవాలని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, నల్లా బాలకృష్ణారావులు కోరారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం, లంకాజోడు, జి.శివడ, మొండెంఖల్, ఉదయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు మారుపేరు అయిన రఘువర్మ.. ఏపీటీఎఫ్ అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్సీ బరిలో ఉన్నారని, ఆయనను గెలిపించేందుకు మనమంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.దుర్గారావు, కురుపాం మండల శాఖ అధ్యక్షుడు ఆకుల జగదీశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం మండల ప్రధాన కార్యదర్శి బంటు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న 104 వాహన ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: తమ సమస్యలు పరిష్కరించాలని 104 వాహన సిబ్బంది కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 104 వాహన సర్వీసులు ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, డీఎస్సీఆర్‌వోఆర్(డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ రూల్ ఆఫ్ రిజర్వేషన్) ద్వారా నియమితులైన 326 మంది సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్య శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, అలాగే 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని, 2020లో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్-ఈఎస్ఐల అరబిందో యాజమాన్యం వాటా ఆ యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి నెలా సక్రమంగా జీతాలు వేయాలని, వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్వీసులను వెంటనే చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చొరవతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, మురళి, తేజ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాలకొండ / కురుపాం

9951602844, 9010204441

Office mail : vzmadvt@gmail.com



పాలకొండ: కాశీవిశ్వేశ్వరాలయంలో ఎమ్మెల్సీ విక్రాంత్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



పాలకొండ రూరల్: గోపాలపురంలో జమ్మి, ఉసిరి, మారేడు చెట్ల వద్ద కార్తీక దామోదరుని పూజలు చేపడుతున్న మహిళలు



వీరఘట్టం : చంద్రమౌళీశ్వరాలయంలో పూజలు చేస్తున్న శర్మయాజీ దంపతులు



వీరఘట్టం : కిమ్మి గ్రామంలో నాగవళి నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

ఘనంగా పోలిపాడ్యమి పూజలు

కార్తీకమాసం చివరి రోజైన సోమవారం పోలిపాడ్యమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి బారులుతీరారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి, ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేశారు. చిన్నా,పెద్దా అంతా సందడిగా గడిపారు. పాలకొండ డివిజన్ కేంద్రంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను సన్మానించారు. - పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



కొమరాడ: పరశురాంపురంలో సహపంక్తి భోజనాలు చేస్తున్న గ్రామస్తులు



కొమరాడ: చంద్రపేట శివాలయంలో భక్తుల పూజలు



సీతంపేట: ఉసిరి చెట్టుకింద కార్తీక వన భోజనాలు చేస్తున్న మహిళా భక్తులు



వీరఘట్టం : ఉమాసోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు